# పరిధి

డిగ్రీ పూర్తికాకముందే ప్రసాద్‌కి రైల్వేలో ఉద్యోగం వచ్చింది. హౌరా వెళ్ళి జాయిన్ అయిపోయాడు.

డిగ్రీ ఫస్ట్ క్లాస్‌లో పాసై సంవత్సరం కావస్తున్నా నాకెటువంటి జాబూ దొరకలేదు. ఇంటర్‌వ్యూల పేరుతో ఇంకా ఊళ్ళ చుట్టూ తిరుగుతూనే వున్నాను.

"తల తాకట్టు పెట్టుకున్న తర్వాత అటు ఇటు తిరగడానికి ఎలానూ కుదరదు. కలకత్తాలో విక్టోరియా మెమోరియల్ జూబిలీ హాల్, బిర్లా ప్లానిటోరియమ్, కాళీగుడి, బేలూరు రామకృష్ణా మఠ్ మొదలయిన చూడదగ్గ ప్రదేశాలెన్నో వున్నాయి. ఓ పదిరోజులపాటు ఇక్కడికి వచ్చావంటే నాకూ కాస్త రిలీఫ్‌గా వుంటుంది. నీకూ ఛేంజ్ ఆఫ్ ప్లేస్‌గా వుంటుంది. తప్పకుండా రా" అంటూ ప్రసాద్ పదేపదే రాయడంతో బయల్దేరాను.

ముందే నేను ఏ బండిలో వస్తున్నానో టెలిగ్రామ్ ఇవ్వడంతో ప్రసాద్ బండి దగ్గరకు వచ్చాడు నన్ను రిసీవ్ చేసుకోవటానికి.

ట్రామ్‌లు, బస్సులు, టాక్సీలు మొదలయిన వాహనాలలో హడావిడిగా వున్న ఆ నగరాన్ని చూడగానే కొద్దిగా కంగారుగా అనిపించింది. ప్రసాద్ వెంట లేకపోతే ఈ నగరంలో తిరగగలనా అన్న అనుమానం వచ్చింది.

"ఇక్కడ నుంచీ మనం మా రూమ్ వున్న ప్రదేశాన్ని చేరుకోవడానికి ట్రామ్‌లో వెళ్ళినా ముప్పావుగంట పడుతుంది." చిన్నగా నవ్వాడు ప్రసాద్.

''అంత దూరమే?!'' ఆశ్చర్యపోయాను.

''నేనింకా చాలా అదృష్టవంతుణ్ణి. లోకల్ ట్రయిన్‌లో రెండు గంటలకి పైగా ప్రయాణం చేస్తేగాని ఆఫీస్‌కి చేరని దూరంలో వున్నవాళ్లు కోకొల్లలు."

రోడ్లమీద, బస్సుల్లోనూ, ట్రామ్‌లలోనూ ఎక్కడ చూసినా మగ వాళ్ళతోపాటు సమానంగా ఆడవాళ్ళు కనిపిస్తున్నారు. అందంగా అలంక రించుకుని సీతాకోక చిలకల్లా తిరుగుతున్న ఆ ఆడపిల్లల్ని చూస్తుంటే నాకు చాలా ఉత్సాహంగా అనిపిస్తోంది.

''ఇక్కడ ఆగుదాం. ట్రామ్ ఇక్కడ ఆగుతుంది. ఆ సూట్‌కేస్ నాకివ్వు.'' చేతిలోంచి బాగ్‌ని అందుకున్నాడు ప్రసాద్.

మాకు కొద్దిగా అవతల అధునాతనంగా అలకరించుకున్న నల్గురు అమ్మాయిలు నిలుచున్నారు. తెల్లటి వాళ్ళ శరీరఛాయ, ఎర్రటి పెదాలు నన్ను రెచ్చగొడుతున్నాయి.

ఇంతలో ఒక ట్రామ్ వచ్చి ఆగింది.

''ఇదికాదు మనం ఎక్కాల్సింది'' అన్నాడు ప్రసాద్. నాకు చాలా బాధగా అనిపించింది. ఆ నల్గురు అమ్మాయిలూ ఆ ట్రామ్ ఎక్కారు గబగబా అందర్నీ తోసుకుంటూ ట్రామ్‌లోపలికి దూసుకుపోతున్న వాళ్ళని చూడగానే బాధనిపించింది. మేమూ ఆ ట్రామ్ ఎక్కేవాళ్ళమయితే ఇంచక్కా వాళ్ళని వరుసుకుంటూ నిలుచునే అవకాశం దక్కేది కదా!

ట్రామ్ వెళ్ళిపోయింది.

''కలకత్తాలో బ్రతకాలంటే ముందు ఆగీ ఆగక ముందే బయల్దేరే ట్రామ్‌లలో ఎక్కడం, దిగడం నేర్చుకోవాలి.'' వెళ్తున్న ట్రామ్‌వంకే చూస్తూ అన్నాడు ప్రసాద్.

''అలా మనిషిమీద మనిషి నిలబడి పోకపోతే తర్వాతి ట్రామ్ వచ్చేదాకా ఆగవచ్చుగా?" అన్నాను.

"ఎంత సేపాగినా అంతే! మరో అయిదు నిముషాలాగి చూడు—ఇంకెంతమంది పోగవుతారో ఇక్కడ!" చిన్నగా నవ్వాడు ప్రసాద్.

"అయినా కానీ ఆడపిల్లలలా మగవాళ్ళని తోసుకుంటూ ఎక్కడం నాకేమీ బాగోలేదు...."

"అదిగో, మన ట్రామ్ వస్తోంది. ఆగీ ఆగకముందే ఎక్కు. మళ్ళీ వెంటనే బయల్దేరుతుంది." హెచ్చరించాడు ప్రసాద్.

ట్రామ్ ఆగీ ఆగకముందే అక్కడున్న జనమంతా ట్రామ్ మీదకి ఎగబడ్డారు. ప్రసాద్ పుణ్యమాని మొత్తానికి ఎక్కగలిగాను.

స్పీడందుకుంది ట్రామ్.

నడుస్తున్న నరకం.

మనిషిమీద మనిషి.

నాకు ఇవతల ఓ యువతి వుండడంతో అంతటి ఇరుకూ నాకు ఇబ్బందిని కలిగించడంలేదు.

ఇలా రోజూ ఈ ఆడపిల్లలు తిరగాల్సిందేనా?

సరిగ్గా మేము దిగాల్సిన స్టాపులోనే ఆ యువతీ దిగింది. దిగీదిగక ముందే చకచకా ముందుకువెళ్ళిపోయింది. ఇంతసేపు అంతమంది పరాయి వాళ్ళ మధ్య అనుభవించిన 'ఇరుకు' ఆ మొహంలో కొంచెం కూడా కని పించడంలేదు నాకు.

ఇంటికి చేరుకున్న తర్వాత కూడా ఈ ఆలోచనలు నన్ను విడిచి పెట్టలేదు. అక్కడి ఆడవాళ్ళు ఎందుకు సిగ్గుని ఇంత పూర్తిగా విడిచి పెట్టేశారు? నాగరికత అంటే ఇదేనా?

ఇవే ప్రశ్నలు ప్రసాద్‌ని అడిగాను.

వాడు చిన్నగానవ్వి "ఈ ప్రశ్నలకు జవాబు రేపు ఉదయం చెప్తా" నన్నాడు.

బాగా బడలికగా ఉండడంతో నేను భోంచేసి పడుకున్నాను. వాడు ఆఫీసకి వెళ్ళిపోయాడు.

సాయంత్రం సినిమాకి వెళ్ళి వచ్చాం.

ఆ రాత్రంతా కబుర్లతో నిద్రలేకుండా గడిపేశాం.

మర్నాడు ఆదివారం -

అయినా పొద్దున్నే లేచాం.

స్నానాదులు పూర్తిచేసుకుని బయటికి బయల్దేరాం.

సరాసరి ఓ పెద్ద పార్క్‌కి తీసుకెళ్ళాడు.

"ఇది రవీంద్రసరాని...." అన్నాడు.

మధ్యలో సరస్సులాగా వుంది. చుట్టూ పార్కు.

ఆ పార్కునే ఆశ్రయంగా చేసుకుని జీవిస్తున్నవాళ్ళు ఎంతోమంది కనిపించారు. వాళ్ళందరూ ఆ మధ్యలో వున్న సరస్సులో స్నానంచేసి, బట్టలుతుక్కుంటున్నారు.

వాళ్ళలో అధికభాగం కట్టుకోడానికి మరో బట్ట కూడా లేని అభాగ్యులే!

వాళ్ళను చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది.

"మన దేశం ప్రగతిపథంలో పయనిస్తోంది" అన్న వాళ్ళందర్నీ అక్కడికి లాక్కొచ్చి వాళ్ళని చూపించాలనిపిస్తోంది.

అప్పుడే స్నానం చేసి, సగం చీర శరీరానికి చుట్టబెట్టుకుని మిగతా సగం చీరని ఆరబెట్టుకుంటున్న ఆ ఆడబడుచుల్ని చూడగానే హృదయం ద్రవించిపోయింది.

అలా వాళ్ళని చూస్తూ నిలుచుండిపోయాను.

"ఏమిటిరోయ్! వాళ్ళ అర్ధనగ్న శరీరాలను చూసి ఆనందిస్తున్నావా?" ప్రసాద్ మాటలు శూలాల్లా నా మనసుని తాకాయి.

వాళ్ళలాంటి దీనపరిస్థితిలో వుండే వాళ్ళలో సెక్స్‌ని చూస్తున్న వాడి హీనసంస్కారానికి వాణ్ణి ఏమి చేసినా పాపం లేదనిపించింది.

''కట్టుకోడానికి మరో చీర కూడా లేకుండా కట్టుకున్న చీరనే అలా వంటిమీదే ఉతుక్కుని రెండోపక్క ఆరబెట్టుకుంటూ, అటు ఆరిన తర్వాత ఆ వైపు కట్టుకుని మొదటివైపు ఆరబెట్టుకుంటున్నవాళ్ళని చూస్తుంటే జాలి కలగకపోతే పోయింది. అంత నీచంగా ఎలా మాట్లాడగల్గుతున్నావ్‌రా?'' ఆశ్చర్యంగా అడిగాను, వాడి కుసంస్కారానికి జాలి పడుతూ.

చిన్నగా నవ్వాడు ప్రసాద్.

"ఎందుకురా నవ్వుతావ్?" నాలో కోపం పెరిగింది. సిగ్గుపడాల్సింది పోయి నవ్వుతాడేం?

"ఇదే నిన్న నువ్వు అడిగిన ప్రశ్నకి జవాబు'' అన్నాడు.

వాడి మాటలు నాకర్థం కాలేదు.

''నిన్న నేనడిగిన ప్రశ్న ఏమిటి?''

"ట్రామ్‌లలో మగవాళ్ళ మధ్య సిగ్గు శరం లేకుండా తిరుగుతున్నారు ఇక్కడి ఆడవాళ్ళు అన్నావుగా?'

"అవును."

"ఇక్కడ వీళ్ళు అర్ధనగ్న ప్రదర్శనకోసం స్నానాలు చేస్తున్నారా? అలాగే వాళ్ళూ విధిలేక మగవాళ్ళ మధ్య అలా అడ్జెస్ట్ అయి తిరుగుతున్నారు. ఇంట్లో ఇద్దరూ పనిచేస్తేనే మధ్యతరగతి కుటుంబాలు గడిచేది. ఆ వచ్చిన కాస్తా టాక్సీలలో తిరిగి ట్రాన్స్‌పోర్ట్‌కోసం తగలెయ్యలేరుకదా? నీ ఆలోచనా పరిధిని కాస్త పెంచి ఆలోచించు" అన్నాడు ప్రసాద్.

కుసంస్కారి ఎవరు? అతనా- నేనా? చెంపమీద ఛెళ్ళున చరిచినట్లయింది. *

(కలువబాల - పక్షపత్రిక, ఏప్రిల్ 16-30, 1986)